ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.40 లక్షల విలువైన చేపపిల్లలను డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావుతో కలిసి మండలంలోని కోనారెడ్డి చెరువులో ఎమ్మెల్యే నాగరాజు శుక్రవారం జారవిడిడారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 194 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని, అర్హులైన పేదలకు కల్యాణలక్ష్మీ లాంటి పథకాలకు ఎప్పటికప్పుడు నిధులు కేటాయిస్తున్నారని, గీత కార్మికులకు శిక్షణ ఇప్పించి కాటమయ్య కిట్లు మంజూరు చేశారని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలు వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి, చీఫ్ ప్రమోటర్ సోమన్న, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి పుష్పలత, అసిస్టెంట్ అధికారి శంకరయ్య, తహసీల్దార్ విజయసాగర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మత్స్య శాఖ మండల అధ్యక్షుడు గుడిబోయిన సారంగపాణి, పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, సుధీర్, నాయకులు పోశాల వెంకన్న, నరుకుడు వెంకటయ్య, కీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే నాగరాజు, ఎర్రబెల్లి స్వర్ణ

మూఢనమ్మకాలు వీడండి

సంగెం : ప్రజలు మూఢనమ్మకాలు వీడి చైతన్యవంతులు కావాలని గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి కోరారు. మండలంలోని మొగిలిచర్లలో గ్రామానికి కీడు సోకిందంటూ ప్రజలు ఈనెల 23న సామూహిక వనభోజనాలకు వెళ్లిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఇటీవల కొద్ది రోజుల వ్యవధిలోనే 45 మంది మృతి చెందగా గ్రామానికి కీడు సోకిందనే ప్రచారం జరిగి గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లిన విషయమై ఆరాతీశారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని, మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలతో నీరు కలుషితమవుతోందని చెప్పారు. బెల్ట్‌షాపులు, గుడుంబాతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గ్రామాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి ప్రజలతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన పలువురు మృతి చెందడంలో వేర్వేరు కారణాలున్నాయని చెప్పారు. వృద్ధాప్యంతో కొందరు, అనారోగ్య సమస్యలతో ఇంకొందరు, వ్యక్తిగత సమస్యలతో మరికొందరు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ పల్లవి మాట్లాడారు. ప్రజలు అనారోగ్యం బారిన పడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజుద్దీన్

క్లుప్తంగా

విద్యార్థికి మాజీ సీఎం కేసీఆర్ అభినందన



ఖానాపురం : మండలంలోని మనుబోతుల గడ్డ గ్రామానికి చెందిన రాగం సంతోశ్ యూరప్‌లోని లాత్వియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందగా ఆయన్ను మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లిలోని తన ఫాంహౌజ్‌లో అభినందించారు. సంతోశ్ పీహెచ్‌డీలో సీటు పొందిన సందర్భంగా కేసీఆర్‌ను కలిసి మాట్లాడారు. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక విభాగంలో ప్రవేశం పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పురుషోత్తం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన శాలివాహన సంఘం సభ్యులు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని తొర్రూరును ఆమె క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అనుమాండ్ల తిరుపతిరెడ్డిని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొండూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు గిరగాని రాజు, ఉపాధ్యక్షుడు గుంటుక యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు..



మండలంలోని కొత్తతండా (జగన్నాథపల్లి) గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం పాక పద్మావతి, ఉపాధ్యాయురాలు రెహానాబేగం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయురాలు రెహానా మాట్లాడారు. కొత్తతండా నుంచి ముగ్గురు యువకులు డీఎస్సీ–2024లో ప్రతిభ చాటి ఉపాధ్యాయులుగా ఉద్యోగ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులుగా చదువుకుని ఉపాధ్యాయులుగా నియమితులయ్యారంటూ బోడ గణేశ్, బోడ సురేశ్, బోడ నరేశ్‌లను అభినందించారు. గణేశ్, సురేశ్, నరేశ్ స్ఫూర్తితో యువత పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

బదిలీ అయిన ఉద్యోగులకు..



నెక్కొండ : మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ నుంచి బదిలీ అయిన వైద్యాధికారి అరుణ్‌కుమార్, ఫార్మసిస్టు శ్రీనివాసాచారి, సూపర్‌వైజర్లు రాజు, మనోజ, ఏఎన్‌ఎం వినోదలను వైద్యాధికారి అర్చన ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాలతో సన్మానించారు. అనంతరం డాక్టర్ అర్చన మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవంతి, సుధ, స్టాఫ్ నర్స్ సునీత, సూపర్‌వైజర్ రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డి, సిబ్బంది దివ్య, సుజాత, ప్రభ, పద్మ, కరుణ, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మామునూరు: విద్యార్థి దశ నుంచే సామాజిక విలువలు, హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌స్పెక్టర్ రమేశ్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మామునూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ హాజరై ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకున్నట్లయితే నేరాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. అనంతరం పలు రకాల ఆయుధాలను ప్రదర్శించారు. వాటి పనితీరు, చట్టాలు, కేసులు, రికార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జ్యోతిరావు బాపూలే గురుకుల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసారాన్ని పెంచుకోవాలి

కొత్తగూడ : సహజ పద్ధతుల ద్వారా భూసారాన్ని పెంచుకోవాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మాలతీ రైతులకు సూచించారు. మండలంలోని సాధిరెడ్డిపల్లి రైతువేదికలో ఫ్యాక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉదయ్, విష్ణువర్ధన్, పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

నెక్కొండ : ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన సుమారు 20 వేల చేపపిల్లలను మండలంలోని ముదిగొండ గిద్దెకుంట చెరువులో ఆయన శుక్రవారం పోశారు. అనంతరం మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, అమలు చేస్తున్న పథకాలను ముదిరాజ్ కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అనుముల శ్రీధర్‌రెడ్డి, నాయకులు భూమాని మాధవరావు, మట్ట భిక్షపతి, ఇంతల రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు పేరుతో యువకుడికి టోకరా

పర్వతగిరి : క్రెడిట్ కార్డు పేరుతో సైబర్ నేరగాళ్లు మండలంలోని యువకుడిని మోసం చేశారు. వివరాలిలా.. మండలంలోని కల్లెడకు చెందిన ప్రసాద్‌కు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. కాగా క్రెడిట్ కార్డు ఇస్తామంటూ వాట్సాప్ ద్వారా ఆయన్ను పరిచయం చేసుకున్నారు. యాప్ పంపి డౌన్‌లోడ్ చేసుకోమని సూచించారు. మోసగాళ్ల మాటలు నమ్మిన ప్రసాద్ వారి సూచన మేరకు ఆధార్, పాన్ కార్డును పంపించాడు. అనంతరం మోసగాళ్లు స్క్రీన్ మిర్రరింగ్ యాక్సెస్‌తో పంపిన ఏపీకె ఫైల్స్‌ను ప్రసాద్ ఇన్‌స్టాల్ చేసుకోగానే నిమిషాల వ్యవధిలో రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.14 వేలు కాజేశారు. బాధితుడు సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1903కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

బ్యాంకులు లింకులు పంపవు

కేవైసీ వివరాల కోసం బ్యాంకులు లింకులు పంపవని స్థానిక ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన మీడియాకు పలు వివరాలు వెల్లడించారు. యూజర్ నేమ్, పాస్‌వర్డ్, ఆధార్ కార్డు సమాచారం, తదితరాలను సోషల్ మీడియాలో షేర్ చేయొద్దని ప్రజలకు సూచించారు. ఆర్‌బీఐ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు బ్యాంకు ఖాతాదారులకు ఎలాంటి లింకులూ పంపవని తేటతెల్లం చేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

నల్లబెల్లి : సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత కల్లెపల్లి ప్రణయ్‌దీప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్ అత్యవసర సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడి రెండు నెలలు కావస్తున్నా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మాదిగ, మాదిగ ఉపకులాలకు అసెంబ్లీలో ఇచ్చిన హామీకి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని కోరారు. మాల ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి మాదిగ ప్రజలను మోసం చేయడం సరికాదన్నారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు (శనివారం) హన్మకొండలో తలపెట్టిన ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్మయుద్ధ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు పరికి కోర్నెల్, బొట్ల నరేశ్, పాలెపాక అరుణ్, శ్యామ్, ప్రశాంత్, వినయ్, కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్

కాంగ్రెస్ నేతకు పరామర్శ



రాయపర్తి : కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు గాయపడిన క్రమంలో హైదరాబాద్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఆమెను పరామర్శించారు. మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొనుకటి రవీందర్‌రెడ్డి, నాయకులు నకిరెడ్డి రాజ్‌కుమార్, సుదగాని నారాయణ, భూక్య భిక్షంనాయక్, యూత్ అధ్యక్షుడు కొనుకటి మహేందర్, తదితరులు కలిసి ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజాక్షేత్రంలోకి వచ్చి సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మంద రాజు, నాయకులు కొనుకటి మురళి, కొనుకటి లింగన్న, నకిరెడ్డి ప్రవీణ్, బాష బోయిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కాలనీలో..

నర్సంపేట : పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన ఆ పార్టీ మండల సమితి సభ్యుడు మొండ్రాతి రవి డెంగ్యూ జ్వరంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. తొలుత రవి చిత్రపటానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయసారధి, రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా నాయకులు గడ్డం నాగరాజు, కొలుగూరి సది, వడ్లకొండ యశోద, ఐత శ్రీకళ, శైలజ, దివ్య, భవానీ తదితరులు పాల్గొన్నారు.

శివరామపురంలో..

రాయపర్తి : మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు నాగపూరి సోమయ్య సోదరి, ఆ పార్టీ మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి గౌడ్ పెద్దమ్మ పోషాల శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు శుక్రవారం పరామర్శించారు. తొలుత శాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెవ్వు కాశీనాథం, తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో మిషన్ ఆపరేటర్ మృతి

ఐనవోలు : బీహార్‌కు చెందిన కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన మండలంలోని వనమాల కనపర్తిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని వీరాంజనేయ క్వారీలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న సుబోధ్ యాదవ్ (36) శుక్రవారం క్వారీలో స్టోన్ కటింగ్ చేస్తుండగా కాలు జారి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఎడమ చెయ్యితోపాటు ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేందర్ కుమార్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. కాగా అనుమతులు లేని జెలిటిన్ స్టిక్స్ (పేలుడు పదార్థం) ఉపయోగించి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్న క్రమంలోనే సుబోధ్ గాయాల పాలైనట్లు సమాచారం. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నిక



దుగ్గొండి : పంబాల కుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని మందపల్లికి చెందిన గడ్డం రాజయ్య, జిల్లా అధ్యక్షుడిగా రౌతు హరికృష్ణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల కుమారస్వామి శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో హరికృష్ణ మాట్లాడారు. పంబాల కులస్తుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. ఎస్సీ కుల ధృవీకరణ పత్రం వచ్చేలా పోరాడతామని చెప్పారు. పంబాల కళాకారుల అభివృద్ధి చొరవ తీసుకుంటామని తెలిపారు. తమను ఎన్నుకున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపాల్ రాజు, రాష్ట్ర కోశాధికారి బత్తుల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఫోరం' మీడియా ప్రతినిధిగా యాదగిరి



చెన్నారావుపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా మీడియాగా ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన సర్కెట్ట యాదగిరిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో యాదగిరి మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. తద్వారా ఫోరం బలోపేతం దిశగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నర్సంపేట : అక్రమంగా విక్రయించిన ప్రభుత్వ భూమిని కాపాడాలని పట్టణానికి చెందిన వేముల కృష్ణప్రసాద్, అంకం బాబురావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయ అధికారికి వారు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యను వివరించారు. పట్టణంలోని వరంగల్ రోడ్డులో సర్వే నంబర్ 702లో ఉన్న ప్రభుత్వ భూమిని మార్త రాజేందర్ అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇతరులకు విక్రయించిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

సభ్యత్వ నమోదు ముమ్మరం చేయండి

ఖానాపురం : మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ శ్రేణులను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో పార్టీ అధికారంలోకి వచ్చాక దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. సభ్యత్వ నమోదులో మండల, గ్రామ కమిటీల నాయకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు.

'ఉపాధి హామీ'ని వినియోగించుకోవాలి

దామెర : ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని ఊరుగొండ, కోగిల్వాయిలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాలకు అవసరమైన పనులతో పాటు వివిధ పనులు కూడా చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో టీఏలు సురేందర్, ప్రిసిల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఖిలా వరంగల్: పడమరకోట జంక్షన్ అమరవీరుల ప్రాంగణంలో ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి, అనంతలక్ష్మి ప్రభుత్వ వైద్య కళాశాల, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్ హాజరై కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తులను మార్కెట్లోనే విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

నెక్కొండ : పంట ఉత్పత్తులను మార్కెట్లోనే విక్రయించాలని రైతులను స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి కోరారు. చిల్లర కాంటాలను ఆశ్రయించొద్దని ఆయన సూచించారు. మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని మార్కెట్లో కొనుగోలు చేస్తామన్నారు. చిల్లర కాంటాలు నిర్వహించే వ్యాపారులకు విక్రయిస్తే తూకంలో, ధర చెల్లింపులో మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. లైసెన్స్ లేకుండా ఎవరైనా క్రయవిక్రయాలకు పాల్పడితే ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మార్కెట్ పరిధిలోని రైతులు పంట ఉత్పత్తులను మార్కెట్లోనే విక్రయించి మార్కెట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్, డైరెక్టర్ కునుసోతు నైజాం నాయక్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఓంకార్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం



నర్సంపేట రూరల్ : ఓంకార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని ఆ పార్టీ నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి కోరారు. ఓంకార్ 16వ వర్ధంతి పక్షోత్సవాల సందర్భంగా నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో ఓంకార్ చిత్రపటానికి మంగళవారం రాజమౌళి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. భారతదేశ వ్యవస్థను, కమ్యూనిస్టు ఉద్యమ స్థితిగతులను ఓంకార్ సమగ్రంగా అధ్యయనం 93 శాతం బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమే సమసమాజ నిర్మాణానికి అవసరమని భావించి ఆ దిశగా పోరాటాలు నిర్మిస్తూనే ప్రజలను చైతన్యవంతం చేశారని తెలిపారు. బూర్జువా పార్టీలు ప్రజలకు సుపరిపాలన అందించలేవని ఓంకార్ స్పష్టం చేశారని చెప్పారు. ఆదివాసీ గిరిజనులకు స్వయంపాలన కల్పించే దిశగా పోరాడినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కౌట్టి సదానందం, అనుమాల రమేశ్, కందికొండ సాంబయ్య, ఆకుల రాజేందర్, కౌట్టి అనసూర్య, గుర్రం రవి, కౌట్టి సూరయ్య, అల్లం నర్సయ్య, కౌట్టి శ్రీనివాస్, న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు ఆకుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని అడవి రంగాపురంలో ఓంకార్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రాజా సాహెబ్ నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఓంకార్ ఉద్యమాలు నిర్మించి ప్రజలకు పాలకులను ప్రశ్నించే తత్వాన్ని నేర్పించారని కొనియాడారు. ఓంకార్ స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి వచ్చి అంతరాలు లేని సమాజ నిర్మాణానికి పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాయకులు సింగతి మల్లికార్జున్, బుడిమె సురేందర్, బత్తిని కుమారస్వామి, సతీశ్, రాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు..

బీజేపీ మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

చెన్నారావుపేట : బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాదాన్ని ప్రజలు, సీపీఎం శ్రేణులు తిప్పికొట్టాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు కోరారు. మండలంలోని ఉప్పరపల్లిలో పరికి మధూకర్, ఏనుగుతల నరేశ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశానికి బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాదంతో ప్రజల్లో చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతోందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తూ సమాజంలో అశాంతిని ప్రేరేపిస్తోందని చెప్పారు. నూతన ఆర్థిక విధానాలతో దేశంలో సంక్షోభం ఏర్పడిందని వివరించారు. బీజేపీ అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాల దిశగా నడిపించాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య సమ్మయ్య, మండల కార్యదర్శి నమిండ్ల స్వామి, మాదాసి యాకూబ్, నాయకులు మొగులోజు శారద, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మొరం తరలింపు

దామెర : నిబంధనల మేరకే మొరం తరలిస్తున్నట్లు తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని పెద్దగుట్ట సమీపంలో జాతీయ రహదారి కోసం మొరం తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని మైనింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. నిబంధనలకు లోబడి తవ్వకాలు చేపడుతున్నట్లు చెప్పారు. తవ్వకాలతో ఏర్పడిన గుంతలను కూడా సంబంధికులు పూడ్చివేయాలని ఆదేశించారు. తనిఖీలో మైనింగ్ ఆర్‌ఐ చంద్రకళ, ఆర్‌ఐ సంపత్, సర్వేయర్లు పాల్గొన్నారు.